

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం పెదపుల్లేరు గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇంటింటికీ వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ప్రభుత్వ వైద్యులు, వారి సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తారన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాయి రాములమ్మ, పిహెచ్‌సి వైద్యులు ఇట్టా గోవర్ధన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ'లోనూ దోపిడీ..!

రూ.వెయ్యి ఖర్చు దాటితే ఆరోగ్యశ్రీ అంటున్న ప్రభుత్వం
ఎక్కడా అమలు కాని ప్రభుత్వ నిబంధనలు
ఆరోగ్యశ్రీ వర్తించినా కనీసంగా రూ.50 వేలు బాదుడు
ప్రశ్నిస్తే వేరే ఆసుపత్రికి వెళ్లాలంటూ హుంకరింపులు
గత్యంతరం లేక అప్పు చేసి వైద్యం చేయించుకుంటున్న పేదలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'మెట్ట ప్రాంతానికి చెందిన ఓ మహిళ వాహనంపై వెళ్తుండగా ప్రమాదానికి గురవ్వడంతో ఎముకలకు సంబంధించిన సమస్య వచ్చింది. దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్తే అన్ని పరీక్షలూ చేసి ఆపరేషన్ చేయాలన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ కూడా మళ్లీ అన్ని టెస్టులూ చేసి రూ.25 వేలు ఖర్చు పెట్టించి ఆపరేషన్ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీలో వచ్చే సొమ్ము సరిపోదని, రాడ్లు వేయడానికి అదనంగా సొమ్ము ఖర్చవుతుందని చెప్పడంతో వారికి ఏం చేయాలో అర్థంకాక అప్పు చేసి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.'

'తణుకు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు నెలలు తక్కువతో బిడ్డ జన్మించాడు. ఇంక్యుబేటర్‌లో (బాక్సు) పెట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ పెట్టకుండా రోజుకు రూ.20 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురైంది.'

పైన పేర్కొన్న ఘటనలు మచ్చుకు మాత్రమే. అనారోగ్యంతో ఆరోగ్యశ్రీ కార్డులతో ఆసుపత్రులకు వెళ్తున్న రోగుల నుంచి కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రులు విచ్చలవిడిగా దోచేస్తున్నాయి. దీంతో ప్రభుత్వం పెద్దఎత్తున ఆరోగ్యశ్రీకి ఖర్చు పెడుతున్నప్పటికీ పేదలకు పూర్తిస్థాయిలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశ్రీలో జరుగుతున్న తంతును ఒకసారి గమనిస్తే ఆసుపత్రి యాజమాన్యాలు ఏవిధంగా దోచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. తీవ్రమైన ఆరోగ్య సమస్యతో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రోగులు వెళ్తున్నారు. ఓపి చీటీ తీసుకుని వైద్యునికి చూపించుకుంటున్నారు. రక్త పరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్ ఇలా అనేక పరీక్షలు చేస్తున్నారు. ఆసుపత్రిని బట్టి దాదాపు రూ.పది వేల నుంచి రూ.20 వేలు వరకూ గుంజుతున్నారు. తర్వాత ఆపరేషన్ పడుతుందని చెప్పి ఆరోగ్యశ్రీలో పెడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ వర్తించాలంటే అప్పటి వరకూ రోగికి చేసిన పరీక్షల రిపోర్టులు, స్కానింగ్‌లకు సంబంధించిన రిపోర్టులను అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలించాక ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తారు. ఆరోగ్యశ్రీ అప్రూవల్ అయిన తర్వాత తొలుత చేసిన టెస్టు రిపోర్టులకు సంబంధించిన సొమ్ము సైతం సదరు ఆసుపత్రికి వస్తోంది. నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ వర్తింపచేసిన తర్వాత ముందుగా టెస్టుల పేరుతో ఖర్చు చేసిన సొమ్మును ఆసుపత్రి యాజమాన్యం రోగికి వెనుకకు ఇవ్వాలి. ఏఒక్క ఆసుపత్రిలోనూ ఇది జరగడం లేదు. అంతేకాకుండా టెస్టులు చేసిన తర్వాత వెంటనే ఆపరేషన్ చేయకుండా నాలుగైదు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలని చెప్పి రూ.50 వేలు వరకూ లాగేస్తున్నారు. తర్వాత ఆరోగ్యశ్రీలో ఆన్‌లైన్ చేసి ఆపరేషన్ చేస్తున్నారు. రోజులు నిండకుండా, శ్వాస వంటి సమస్యలతో పుట్టిన పసికందులను ఇంక్యుబేటర్‌లో పెట్టేందుకు ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే ఎక్కడా అది అమలు కావడం లేదు. నాలుగైదు రోజులు సొమ్ము తీసుకుని తర్వాత ఇంక్యుబేటర్‌లో పెడుతున్నారు. మొదట నాలుగు రోజులకు రోజుకు రూ.20 వేలు చొప్పున రూ.లక్ష వరకూ దోచేస్తున్నారు. కిడ్నీ, గుండె వంటి సమస్యల్లో ఏఒక్క అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్లినా ఇదే పరిస్థితి. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ కనీసంగా రూ.40 వేలకుపైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ముందుగా చేసిన టెస్టులకు సొమ్ము రాదని చెబుతున్నారు. దీనిపై రోగులకుగాని, వారి కుటుంబ సభ్యులకుగానీ అవగాహన ఉండటం లేదు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే వేరే ఆసుపత్రికి తీసుకుపోండంటూ ఆసుపత్రి యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. ఫిర్యాదు చేస్తే అనారోగ్యంతో ఉన్న తమవారికి ఏమైనా అవుతుందేమోననే భయం కుటుంబ సభ్యులను వెంటాడుతోంది. అంతేకాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని ఆసుపత్రుల చుట్టూ తిప్పలేక మౌనంగా ఉండిపోతున్నారు. ఎముకలకు సంబంధించిన ఆపరేషన్ జరిగితే ఆరోగ్యశ్రీలో రాడ్లు బాగోవని, అదనంగా మరో రూ.30 వేలు, రూ.40 వేలు వరకూ ఖర్చు చేయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ఫలాలు పేదలకు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది.

అవగాహన కల్పించడంలో ఆరోగ్యమిత్రలు విఫలం

ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రి ఆవరణలో ఆరోగ్యమిత్ర ఉంటారు. ఆరోగ్యశ్రీ వర్తించాలంటే వారే ఆన్‌లైన్ చేయాలి. అక్కడ జరుగుతున్న తంతు అంతా వారికి తెలిసినప్పటికీ రోగులకుగాని, వారి బంధువులకుగాని అవగాహన కల్పించడంలో ఆరోగ్యమిత్రలు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి వద్దకు వెళ్లి సొమ్ము ఏమైనా ఖర్చు పెట్టారా.. యాజమాన్యం మీకు తిరిగిచ్చిందా.. అని అడిగే దాఖలాల్లేవు. ఒకవేళ జరిగినా అది తూతూమంత్రంగానే తప్ప రోగికి న్యాయం చేసేలా ఉండటం లేదు. ముందుగా చేసిన టెస్టుల సొమ్ము యాజమాన్యం తిరిగివ్వాలని, ఆవిధంగా ఏమైనా ఖర్చు చేశారా అని కూడా అడగని పరిస్థితి నెలకొంది. గతంలో ఆరోగ్యమిత్ర కేబిన్‌ల వద్ద వారి ఫోన్ నెంబర్లు బోర్డుపై రాసి పెట్టేవారు. చాలాచోట్ల ఇప్పుడు ఆ ఫోన్‌నెంబర్లు అనేవి లేవు. ఒకవేళ అడిగినా ఇవ్వని పరిస్థితి ఉంది. ఆరోగ్యశ్రీ నిబంధనలను ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఆరోగ్యమిత్రలు అవగాహన కల్పిస్తే సామాన్య ప్రజానీకానికి మరింత ప్రయోజనం చేకూరుతోంది.

ఆరోగ్యశ్రీలో ఉచితంగానే వైద్యం

టి.ఆండ్రో ఆల్బర్ట్‌లూయిస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

ఆరోగ్యశ్రీలో చేరిన రోగులకు ఉచితంగానే వైద్యం ప్రభుత్వం అందిస్తోంది. ఎటువంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదు. ఏమైనా అనుమానాలు ఉంటే ఆరోగ్యమిత్రను కలిస్తే వివరాలు చెబుతారు. ఆరోగ్యశ్రీ ఆమోదమైన తర్వాత ముందుగా చేసిన టెస్టుల సొమ్ము కూడా రోగికి చెల్లించాల్సి ఉంది. ఆరోగ్యశ్రీలో చేరిన తర్వాత కూడా డబ్బు వసూలు చేస్తే ఫిర్యాదు ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

మరోసారి అధికారం అందించండి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

అన్ని తరగతుల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సిఎం జగన్‌ను ప్రతిఒక్కరూ ఆశీర్వదించి మరోసారి అధికారం అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కోరారు. శనివారం బొండాడపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రూ.17.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ మార్చి నాటికి రహదారుల పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కోపల్లె వంతెనను పూర్తి చేస్తానని, గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు వేయిస్తానని తెలిపారు. రాష్ట్రంలో ధరల నియంత్రణ చేస్తున్నామన్నారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ గ్రామంలో జలజీవన్ మిషన్ కింద పనులు పెండింగ్లో ఉన్నాయన్నారు. డ్రెయినేజీలు, వంతెనలు, రోడ్లు నిర్మించాల్సి ఉందని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నర్సింహరాజు మాట్లాడుతూ గ్రామంలోని పేదలకు అన్నివిధాలా సహాయపడుతూ వివిధ పథకాల ద్వారా ప్రజలకు అండగా ఉండటమే ప్రభుత్వ ఆశయమన్నారు. రూ.మూడు కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేశామని, మరో మూడు కోట్లు విలువైన పనులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గోకరాజు రామరాజు, గాదిరాజు సుబ్బరాజు, ఎంపిపి పెన్మత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, గ్రామ సర్పంచి గోళ్ల సత్యనారాయణ, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేష్న రాంబాబు, మాజీ సర్పంచి కందుల వెంకట మల్లికార్జునరావు, మన్నే నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బొండాడపేటలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

ఆక్వా సదస్సులు రైతులకు ఉపయోగకరం

ఆక్వా ఎక్స్‌పో సదస్సులు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాలులో మూడు రోజులపాటు నిర్వహించే ఎక్స్ ఇండియా ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వా రంగానికి ఏ విధమైన సీడ్ వేయాలి, ఏ విధమైన మేత వేయాలి, ఏమి మందులు వాడాలి తదితర అన్ని విషయాలు ఇక్కడ తెలుస్తాయని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ఇటువంటి కార్యక్రమం భీమవరంలో పెట్టడం ఆక్వా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్‌లు నిరంతరం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆక్వా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు రైతులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆక్వా ఎక్స్ ఇండియా హైదరాబాద్ సిఇఒ వేణు దంతులూరి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, వైసిపి నేతలు గోకరాజు రామరాజు, గాదిరాజు సుబ్బరాజు, వివిధ సంస్థల యజమానులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.



వివిధ రకాల రొయ్యల మేతలను పరిశీలిస్తున్న మంత్రి

హెల్త్ అలవెన్స్ సొమ్ము రికవరీ చేస్తే ఆందోళన

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

పారిశుధ్య కార్మికుల హెల్త్ అలవెన్స్ ప్రభుత్వం రికవరీ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని సిఐటియు నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి కమిషనర్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్య కార్మికులు కంకణబద్ధులై పని చేశారన్నారు. అటువంటి కార్మికులు పోరాడి సాధించుకున్న హెల్త్ అలవెన్స్‌ను రద్దు చేసి 2022 మార్చి నుండి జులై వరకు ఇచ్చిన హెల్త్ అలవెన్స్ సొమ్మును కార్మికుల జీతాల నుండి రికవరీ చేయాలని సర్క్యులర్ పంపడం దుర్మార్గమని మునిస్వామి అన్నారు. రెండు మాసాల క్రితం ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు ఇచ్చే అలవెన్స్ నిలుపుదల చేస్తే కార్మికులు పెద్దఎత్తున సమ్మె చేసి సాధించుకున్నారని గుర్తు చేశారు. ప్రజల సంఖ్యను బట్టి కార్మికులను నియమించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. జగన్ పాదయాత్ర సమయంలో ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేస్తానని వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆదినారాయణబాబు, అర్జీ కృష్ణబాబు, కొండ్రే నాగబాబు, బోడపాటి నారాయణ, ఎ.మల్లేశ్వరి, పి.కృష్ణబాబు, ఎ.అప్పన్న పాల్గొన్నారు.



నినదిస్తున్న మున్సిపల్ కార్మికులు

వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వారం రోజుల్లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లూ చేసినట్లు పౌర సరఫరాల శాఖ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల మేనేజర్లు తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన 'ధాన్యం కొనండయ్యా' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇ-క్రాప్, ఇకెవైసి డేటాను సేకరించేందుకు ప్రధాన కార్యాలయం నుంచి తగిన ఉత్తర్వులు ఇంకా జారీ కాలేదన్నారు. మరో వారం రోజుల్లోపు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయి సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, గ్రామస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసే సిబ్బందికి, వాలంటీర్లకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల వద్ద నుండి నాణ్యతా ప్రమాణాలకు (ఎఫ్ఎక్యూ) లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో తుఫాన్ల వల్ల ధాన్యం దెబ్బతింటే మాత్రమే ప్రభుత్వం తడిచిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం

ఒక ప్రయివేటు హాస్టల్‌లో తోటి విద్యార్థి అంకిత్‌పై అమానుషంగా దాడికి పాల్పడిన నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ సిఐ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో విచారణ అనంతరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రవీణ్, ప్రేమ్, నీరాజ్, స్వరూప్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫైర్‌స్టేషన్ ఎస్ఐ, ఇద్దరు హెచ్‌సిలపై

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

తాడేపల్లిగూడెం ఫైర్ స్టేషన్ ఎస్ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైంది. ఫైర్ ఎస్ఐ రామారావు, హెడ్ కానిస్టేబుళ్లు రావూరి వెంకట సత్యనారాయణ, శ్రీశైలం తనను కులం పేరుతో దూషించారని అదే స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఏలేటి సాగర్‌బాబు ఫిర్యాదు మేరకు తాడేపల్లిగూడెం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై నరసాపురం డిఎస్‌పి విచారణ చేపట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వాతావరణ కాలుష్య రహిత వాహనాలు వాడాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు యువత సైకిళ్లు, ఎలక్ట్రికల్ వాహనాలను ఉపయోగించాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు సూచించారు. కళాశాల ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యాన ప్రతి శనివారం కళాశాలను గ్రీన్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు మోటార్ వాహనాలను ప్రాంగణంలోకి రాకుండా గేటు బయట నిలుపుదల చేశారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం బాగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రధాన నగరాల్లోనే కాకుండా జనసాంద్రత ఎక్కువగా ఉన్న పట్టణాల్లో కూడా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రమాదకర స్థాయిలో పెరుగుతుందన్నారు. దీనిని తగ్గించేందుకు విద్యార్థి, యువత, మేధావులు సొసైటీలో చైతన్యం నింపాలని సూచించారు. ప్రధానంగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి క్యాడెట్స్ ఈ విషయంలో చైతన్యంతో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రతి శనివారం కళాశాలను గ్రీన్ క్యాంపస్‌గా మార్చేందుకు ఎన్ఎస్ఎస్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య మాట్లాడుతూ భారతదేశంలో ఏటా తొమ్మిది లక్షల కోట్ల క్రూడాయిల్ వినియోగిస్తున్నారని, దీనిని తగ్గించేందుకు విద్యుత్ వాహనాల వాడకం పెరగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌తోపాటు పలువురు అధ్యాపకులూ స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జగపతిరాజు

అనధికార లేఅవుట్లను గుర్తించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అనధికార లేఅవుట్లను గుర్తించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో అనధికార లేఅవుట్లు, జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇయుడిఎ (ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులు, భీమవరం మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో అనధికార లేఅవుట్లను గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. మధ్యఆదాయ వర్గాలకు ప్రభుత్వం సరసమైన ధరకు మంజూరు చేయనున్న ప్లాట్లకు భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. తాడేపల్లిగూడెంలో 30 ఎకరాలు, తణుకులో 46 ఎకరాలకు సంబంధించిన భూసేకరణ ప్రతిపా దనలను వెంటనే ప్రభు త్వానికి సమర్పిం చాలన్నారు. ఇయుడిఎ నిధులతో జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పనులను గుర్తించి ప్రతిపాదనలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇయుడిఎ వైస్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్, ప్లానింగ్ అధికారి ఎన్.సురేఖ, సహాయ ప్లానింగ్ అధికారి వి.సుధాకర్, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఎసిపి పి.గౌర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కాటేస్తున్నా.. కదలిక లేదే..!

అనంతపురం తరహాలో మెట్టలో తరచూ విద్యుత్ ప్రమాదాలు -బాలికలను చిదిమేస్తున్న పరిచయస్తులు



విద్యుత్ తీగలు కూలీల ప్రాణాలను కబళిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో విద్యుత్ తీగలు తెగిపడి కూలీలు మరణించిన ఘటన జిల్లాలో మెట్టప్రాంతంలో తరచూ చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. అలాగే స్కూళ్లకు వెళ్తున్న బాలికలపై కన్నేసిన పరిచయస్తులే కామాంధులై కాటేస్తుండటం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది.

జంగారెడ్డిగూడెం మండలంలో ఉదయమే పాలు కోసం పొలం వద్ద ఉన్న పశువుల శాల వద్దకు మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు అన్నదమ్ములు మార్గమధ్యంలో తెగిపడి ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగల వల్ల ప్రమాదానికి గురై సజీవ దహనమయ్యారు. ఇటీవల లింగపాలెం మండలంలో ఆయిల్‌పామ్ తోటల్లో గెలలు కోస్తుండగా అటువైపుగా వెళ్లిన విద్యుత్ తీగల వల్ల కూలీ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ తరహా ఘటనలు చింతలపూడి, పెదవేగి, ద్వారకాతిరుమల, కామవరపుకోట తదితర మండలాల్లో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో మృతులు సామాన్య కూలీలు కావడంతో ఎలాంటి పరిహారమూ దక్కడం లేదు. పామాయిల్ కార్మిక సంఘం జోక్యం చేసుకున్న చోట కొద్దోగొప్పో పరిహారం అందుతుంది. ఈ ప్రమాదాలతో ఆయా కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నాయి. అదే సమయంలో ఈ ప్రమాదాల నివారణకు ఇటు ప్రభుత్వం, అటు విద్యుత్ శాఖ నుంచి నిర్దిష్ట కార్యాచరణ కానరావడం లేదు. ఇటీవల విద్యుత్ శాఖాధికారులు ఆయిల్‌పామ్ గెలలు కోసేటప్పుడు తమకు సమాచారం అందిస్తే అటువైపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే ఆ సమాచారం ఎవరిస్తారు.. ఎవరు బాధ్యత వహిస్తారనేది స్పష్టత లేదు. దీనికి సంబంధించి రైతు, ఆ ప్రాంత ట్రాన్స్‌కో ఎఇ బాధ్యత వహించాల్సి ఉంటుంది. లైన్‌మెన్లే సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి లైన్లు బాగుచేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయ్యి పలువురు, ప్రయివేటు వ్యక్తులు మరణిస్తున్న ఘటనలు కోకొల్లలు. ఆయా సందర్భాల్లో విద్యుత్‌శాఖలో భాగమైన జూనియర్ లైన్‌మెన్ల కుటుంబాలకు కొంత న్యాయం జరుగుతున్నా ప్రయివేటు సిబ్బంది కుటుంబాలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆయిల్ పామ్ గెలలు కోసే కార్మికుల ప్రాణాలకు ఎవరూ బాధ్యత పడతారనేది స్పష్టత రావాల్సి ఉంది. ఆయిల్‌పామ్ గెలలు కోసేటప్పుడు ఆ ప్రాంతంలో విద్యుత్ తీగలున్నా ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ కవచాలు రైతు సమకూర్చాల్సి ఉంది. అదే సమయంలో విద్యుత్ లైన్ల ప్రాంతంలో పామాయిల్ చెట్లు ఆ స్థాయిలో పెరిగి ఉంటే దాన్ని విద్యుత్ శాఖ సిబ్బంది గుర్తించి ఆయా రైతులను హెచ్చరిస్తే ముందుగానే జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతోపాటు ఒకవేళ అనూహ్య రీతిలో ఏదైనా ప్రమాదం సంభవించి ప్రాణనష్టం చోటుచేసుకుంటే కార్మిక కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం ఒక విధానం ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఓపక్క పామాయిల్ రైతుల సమస్యలను పట్టించుకోకుండా.. మరోపక్క పామాయిల్ గెలలు కోసే కార్మికుల ప్రాణాలను గాలికొదిలేసేలా ప్రభుత్వ విధానాలు ఉండటంపై అంతా పెదవి విరుస్తున్నారు. పామాయిల్ రైతుల, కార్మికుల కష్టాలు గట్టెక్కేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

కాటేస్తున్న కామాంధులు

జిల్లాలో వరుసగా పోక్సో కేసులు నమోదవుతుండటం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. తణుకు, వీరవాసరం మండలాల్లో ఇటీవల రెండు పోక్సో కేసుల్లో బాలికలపై అఘాయిత్యానికి పాల్పడింది పరిచయస్తులే కావడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. నిర్భయ, దిశ చట్టాలు వంటివెన్ని ఉన్నా మహిళలపై అఘాయిత్యాలకు అడ్డూఅదుపు లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. చట్టాలు చేసి చేతులు దులుపుకుంటున్న పాలకులు అఘాయిత్యాలకు కారణమవుతుండగా వీటిని ప్రేరేపిస్తున్న అంశాలపై దృష్టి పెట్టలేకపోవడం ప్రధాన కారణంగా కన్పిస్తోంది. యువతను ప్రభావితం చేసి పక్కదోవ పట్టించే అశ్లీల అంశాలను నియంత్రించే వ్యవస్థ నేటికీ లేకపోవడం బాధాకరం. దీనికితోడు కేసులు నమోదైనప్పుడు త్వరితగతిన విచారించి నేరస్తులకు కఠిన శిక్ష పడేలా యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించకపోవడం కామాంధుల స్వైరవిహారానికి కారణమవుతోందని స్పష్టమవుతోంది. చట్టాల పేర్లు చెప్పి ప్రచారం మాని వాటిని కట్టుదిట్టంగా అమలు చేయడంతోపాటు అఘాయిత్యాలను ప్రేరేపించే మాధ్యమాలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అప్పుడే మన కనురెప్పలైన బాలికలను, మహిళలను కామాంధుల నుంచి రక్షించుకోగలమని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. లేనిపక్షంలో కాటేసే కామాంధులకు ప్రభుత్వం పరోక్షంగా మద్దతు పలుకుతున్నట్లేనని భావించక తప్పదు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఇళ్ల స్థలాల కేటాయింపులో పొరపాటు

ప్రజాశక్తి - వీరవాసరం

పెర్కిపాలెంలో జగనన్న లేఅవుట్ వద్ద ఇళ్ల స్థలాల కేటాయింపులో పొరపాట్లు జరిగినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో జాతీయ రహదారి డిఇ శ్రీనివాసరావు, తహశీల్దార్ సుందర్రాజు క్షేత్రస్థాయిలో ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. పెర్కిపాలెం-నందమూరుగరువు పుంత రోడ్డు మార్గంలో కొంతమంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే అప్పటికే ఆ స్థలంలో 165 జాతీయ రహదారికి ఎలైన్‌మెంట్ చేశారు. అయితే మండల స్థాయి అధికారులు మారడం వల్ల జాతీయ రహదారికి ఎలైన్‌మెంట్ జరిగిన విషయాన్ని గుర్తించకుండా అదే స్థలాన్ని ఇళ్ల స్థలాలకు కేటాయించడం జరిగింది. దీంతో ఇప్పటికే కొంత మంది లబ్ధిదారులు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారు. కొంత మంది బేస్‌మెంట్ వేయగా కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. విషయం తెలిసిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల తప్పిదం వల్ల తామెందుకు నష్టపోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వాస్తవ పరిస్థితిని పరిశీలించి పొరపాటును గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే క్రమశిక్షణ అలవర్చుకోవాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దిగమర్తి సూర్యకుమారి అన్నారు. శనివారం ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పసలపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, మెయిన్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడి విద్యాభ్యాసం, ఆహార విషయాలు, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు గుడాల లక్ష్మీ దుర్గ, విశ్వనాథం పద్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్ఒ మృతి

పాలకొల్లు రూరల్:పాలకొల్లు రూరల్ పంచాయతీ విఆర్ఒగా పనిచేస్తున్న పట్టపు రాజేంద్రప్రసాద్ (58) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం గోరింటాడ. రాజేంద్ర ప్రసాద్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఇటీవలే హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయి విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లంకలకోడేరులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలు ధర్మావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మావు ఫౌండేషన్ ఛైర్మన్, శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సాంస్కృతిక కళలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చొప్పల రజనీ కుటుంబరావు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు, నేతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస డీలక్స్ థియేటర్ వద్ద ఉచిత షుగర్ వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు ముచ్చర్ల సత్యనారాయణ, కార్యదర్శి చల్లా ఆదినారాయణ క్యాంపు నిర్వహణకు కృషి చేశారు. వారు సంతకు వచ్చిన పలువురు అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ శిబిరాన్ని క్లబ్ వీసీ మాజీ చైర్మన్ పి.ఎన్.డి వరప్రసాద్ ప్రారంభించారు.

ఆగర్రులో ఫ్యామిలీ ఫిజిషియన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ఆగర్రు గ్రామ సచివాలయం పరిధిలోని హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లో శనివారం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.నవ్యజీవన్ గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్ కంటి చూపు సమస్యలున్న వారికి ఆరోగ్య పరీక్షలు, మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామస్తులకు ఈ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సాకా గంగారత్నం, సచివాలయ కార్యదర్శి ఆనందబాబు, 104 వాహనం వైద్యాధికారి పివి నారాయణ పాల్గొన్నారు.

వీరవాసరంలో అన్న సమారాధన

వీరవాసరం:వీరవాసరం శ్రీవీరేశ్వర, విశ్వేశ్వర దేవస్థానంలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శనివారం భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కుమారుడు వైసిపి యువనేత రవితేజ ప్రారంభించారు. ఈ అన్నసమారాధనలో యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకవర్గ ఛైర్మన్లు కందుల సురేష్, పాలా నాగరాజు, సర్పంచి చికిలే మంగతాయారు, గూడూరి ఓంకార, నూకల కనకారావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జిఒలను అమలు చేయాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం మల్లుల ఏసుబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులుగా, ఎలక్ట్రికల్ వర్కర్లుగా, పంపు ఆపరేటర్లుగా వివిధ రకాల విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. తొలగిస్తామంటూ బెదిరింపులు, నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోవడం, పనిముట్లు ఇవ్వకపోవడం వంటి వాటితో పాటు చెప్పులు, యూనిఫారాలు, నూనె, సబ్బులు కూడా అందుబాటులో ఉంచడం లేదన్నారు. తక్షణం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాపాక సుబ్బారావు, కొల్లి కనకరాజు, గంట ప్రదీప్, ఎ.ప్రభాకర్‌రావు, ఉదారావు, రాము, పండు పాల్గొన్నారు.

నాడు - నేడుతో పాఠశాలల అభివృద్ధి : గ్రంధి

భీమవరం రూరల్:నాడు - నేడులో ప్రతి ప్రభుత్వ పాఠశాలలనూ, కాలేజీలనూ ఆధునిక ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి చేస్తున్నామని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం దొంగపిండిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సంబంధించి రూ.22 లక్షల నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో రూ.22 లక్షల 50 వేలతో నిర్మించే ఆరు సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఈ మూడేళ్ల కాలంలో 98 శాతం దాటి అమలు చేశామని తెలిపారు. మరో పక్క గ్రామాలలో సీసీ, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జెడ్‌పిటిసి కె.నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

పాలకొల్లు :పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు, కొత్తపేట మున్సిపల్ ప్రయిమరీ స్కూల్ విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు సహకారంతో పాలకొల్లు కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఆధ్వర్యంలో శనివారం లాంగ్ నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుద్ధరాజు మాట్లాడుతూ విద్య, వైద్యానికి తెలుగు రాష్ట్రాల్లో ఫౌండేషన్ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, సబ్బితి రమేష్ కుమార్ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

62 మందికి కళ్లజోళ్లు పంపిణీ

పాలకొల్లు రూరల్:ఉల్లంపర్రులో పాలకొల్లు లయన్స్ ఫెమినా క్లబ్ వారి ఆర్థిక సాయంతో 62 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫెమినా క్లబ్ ప్రెసిడెంట్ సామవేదం వసంత లక్ష్మి మాట్లాడుతూ కంటి చూపు సమస్య ఉన్న పేదవారికి తమ క్లబ్ ద్వారా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మాజీ, రావాడ సతీష్, మణిదీప్తి పాల్గొన్నారు.

క్షతగాత్రుడు మృతి

పాలకొల్లు రూరల్:గత నెల 30న దగ్గులూరులో ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో మొగల్తూరుకు చెందిన పూతినీడి అంజిబాబు (38) తీవ్ర గాయాలపాలై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మార్కెట్ యార్డుకు చెక్ పోస్టులే ఆదాయ వనరులు

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం మార్కెట్ యార్డుకు చెక్ పోస్టులే ఆదాయవనరులని, వాటి నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రాజు మాట్లాడుతూ నరసాపురం మార్కెట్ యార్డు పరిధిలో చిట్టవరం, జగన్నాథపురం, వెంప గ్రామాల్లో చెక్ పోస్టులు ఉన్నాయని, వీటి ద్వారా మార్కెట్ యార్డుకు సమకూరే ఆదాయ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ చెక్ పోస్ట్ ద్వారా సంవత్సరానికి రూ.3 కోట్ల ఆదాయం సమకూరుతుందని అధికారులు జవాబిచ్చారు. ఈ వనరులను మార్కెట్ యార్డ అభివృద్ధికి వినియోగించుకునేలా సభ్యులంతా కలసికట్టుగా పనిచేయాలని చీఫ్‌విప్ తెలిపారు. మార్కెట్ యార్డ ద్వారా పుంత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.12.12 కోట్లు వినియోగించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. 15 చోట్ల పుంత రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. త్వరలో మార్కెట్ యార్డ సమీపంలో రైతులకు ఉపయోగపడేలా సుమారు రూ.80 లక్షలతో ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ మాట్లాడుతూ చెక్ పోస్ట్‌లో సిబ్బందికి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి వైస్ ఛైర్మన్ కటికల సూర్యారావు, డైరెక్టర్ కొప్పునీడి శివాజీ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వ్యకాస ఆధ్వర్యాన విరాళాల సేకరణ

ప్రజాశక్తి - పాలకోడేరు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ విరాళాలు అందించిన ప్రజలందరికీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. సంఘం 31వ జిల్లా మహాసభలు శృంగవృక్షం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికీ విరాళాల సేకరణ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడిన తర్వాత జరుగుతున్న ఈ మహాసభలకు 19 మండలాల నుండి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి వ్యాపార వర్గం, సామాన్య ప్రజానీకం ఎంతో ఆప్యాయంగా విరాళాలు అందించారని వారందరికీ అభినందనలు తెలుపుతున్నామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు శేషపు అశ్రియ్య, బళ్ల చిన వీరభద్రరావు, కండెల్లి సోమరాజు మాట్లాడుతూ శృంగవృక్షంలో జరుగుతున్న మహాసభలకు 19 మండలాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని, ఈ మహాసభల్లో జిల్లాలో రానున్న మూడు సంవత్సరాల కాలంలో నిర్వహించబోయే ఉద్యమ కర్తవ్యాలను నిర్ణయించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జక్కంశెట్టి వెంకటలక్ష్మి, పోతుల మృత్యుంజయ, మూడే మోజేష్, ఎడ్ల మోహన్ రావు, కొటికలపూడి శ్రీనివాస్, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, ఖండవల్లి వెంకన్న, తోట వెంకటేశ్వరరావు, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్‌క్యూఎఎస్‌కు పెనుమంట్ర పిహెచ్‌సి ఎంపికపై హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర పిహెచ్‌సి నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సర్వీస్‌కు (ఎన్‌క్యూఎఎస్)కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఎంపిపి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అన్నారు. శనివారం పిహెచ్‌సి పరిసరాలను ఆయన పరిశీలించి సేవల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్‌క్యూఎఎస్‌కు పిహెచ్‌సి ఎంపిక కావడానికి ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి చేసిన సేవలను డాక్టర్ కె.లావణ్య, వై.అనూషతో పాటు సిబ్బంది, పెద్దలు కొనియాడారు. అంతేకాకుండా ఎంపిపి వ్యక్తిగతంగా తల్లి కమల పేరుతో రోగులకు రక్త పరీక్షలు చేసే సుమారు రూ.1.30 లక్షలతో బయోకెమిస్ట్రీ ఎనలైజర్‌ను పిహెచ్‌సికి రోగుల సౌకర్యార్థం అందజేశారు. సెంట్రల్ టీమ్‌కు ఎంపిక కావడానికి కృషి చేసిన హెల్త్ అసిస్టెంట్లు శరత్ చంద్రారెడ్డి, సురేష్ బాబు, కృష్ణ, గోపాలస్వామి, ఎఎన్ఎం, ఆశా వర్కర్స్, ఎంఎల్‌హెచ్‌పి, నాలుగో తరగతి చెందిన ఉద్యోగులను ఎంపిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో గరువు సర్పంచి ముదునూరి నాగరాజు, సిహెచ్ఒ మిరియం, పిహెచ్ఎన్ పరంజ్యోతి, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, సూపర్‌వైజర్స్ మల్లేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, అమ్మాజీ, వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.



పిహెచ్‌సి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపిపి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి)

ఎక్కువ కేసులు రాజీ చేయాలి : జడ్జి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - తణుకురూరల్

ఈ నెల12వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయడానికి కృషి చేయాలని తణుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, నాల్గో అదనపు జిల్లా జడ్జి వివిఎస్ శ్రీనివాసశర్మ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస శర్మ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులో ఇరు పార్టీలకు నోటీసు ఇచ్చి, వారితో సమస్యను సామరస్యంగా పరిష్కరించి, కోర్టు ముందు హాజరుపర్చి ఇరు పార్టీలతో చర్చించి ఇద్దరికీ సమన్యాయం చేయడానికి కృషి చేయాలన్నారు. కేసులకు సంబంధించి న్యాయవాదులతో మాట్లాడి రాజీకి ప్రయత్నించి, అధిక సంఖ్యలో కేసుల రాజీకి ప్రయత్నించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.నాగశైలజ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.బాబు, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎవి.నాగరాజు, స్పెషల్ మేజిస్ట్రేట్ పిఎస్.చిరంజీవిరావు, తణుకు పట్టణ సిఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకోడేరు :ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని తహశీల్దార్ షేక్ హుస్సేన్ అన్నారు. శనివారం పెన్నాడ, శృంగవృక్షంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. న్యాయవాదులు ప్రసాద్, అంబేద్కర్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా అరికట్టేందుకు చట్టాలున్నాయన్నారు. పారా లీగల్ వాలంటీర్ సత్య సుధ మాట్లాడుతూ బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వం న్యాయ సేవాధికార సంస్థ ను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఏర్పాటు చేసిందన్నారు. వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మేళం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించేందుకు నరసాపురం, భీమవరంలో ట్రిబ్యునల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎస్ఐ రామచంద్రరావు మాట్లాడారు. సదస్సులో ప్రధానోపాధ్యాయులు తోట కాశీజగన్నాథం, గ్రామాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - తణుకురూరల్

మానసిక ఒత్తిడి తగ్గించుకుని ఆలోచిస్తే ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని మానసిక వైద్య నిపుణులు సాయి బాలాజీ అన్నారు. శనివారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పొగాకు నియంత్రణపై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయిబాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి ఏర్పడినప్పుడే చెడు అలవాట్లకు లోనవుతారని, దాని వల్ల భవిష్యత్తు పాడవుతుందని తెలిపారు. ఇటువంటి ఒత్తిడులు పోవాలంటే విద్యార్థులు యోగా, మెడిటేషన్, ప్రాణాయామం అలవాటు చేసుకోవాలన్నారు. దంత వైద్యనిపుణులు అరుణ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడేవారికి కంటిచూపు దెబ్బతినడం, దగ్గు, బ్లెడ్ కేన్సర్, కళ్లు దెబ్బతినడం తదితర వ్యాధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జి.రమ్య, సిహెచ్ రమేష్‌బాబు, సైకాలజిస్టు కెసిహెచ్ వీర్రాజు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చివేత దారుణం : జనసేన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జనసేన ఆవిర్భావ వేడుకలు జరుపుకునేందుకు సభకు స్థలం ఇచ్చిన వారి ఇళ్లను అన్యాయంగా కూల్చడం దారుణమని జనసేన నియోజకవర్గ కన్వీనర్ బొమ్మిడి నాయకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ను ఎదుర్కొనే ధైర్యం లేక జగన్ ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పాలకులు ఇకనైనా ఇటువంటి చర్యలు మానుకుని రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

గుమ్ములూరులో నీటి పరీక్ష

ప్రజాశక్తి - పోడూరు

తాగునీరు కలుషితం ప్రజలకు అనారోగ్యం శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఉదయం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుమ్ములూరులో తాగునీటి ట్యాంకు వద్ద నీటి శాంపిల్స్ తీసుకుని పరీక్షించారు. ఒకటి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి తాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎఎస్ఎ రామస్వామి, డిఇ టి.శ్రీనివాసరావు, ఎఇ మూర్తిరాజు, సర్పంచి గొట్టుముక్కల సోనియా రమేష్ పాల్గొన్నారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని దొంగరావిపాలెం చెక్ పోస్ట్ వద్ద శనివారం వివిధ శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా ఓ వాహనంలో తరలిస్తున్న 8 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని రవాణ శాఖ అధికారి రవికుమార్, విజిలెన్స్ అధికారి శివరామకృష్ణ, సివిల్ సప్లై అధికారి నాగరాజు తెలిపారు.

క్రీడా పోటీలకు జట్ల ఎంపిక

ప్రజాశక్తి - తణుకురూరల్

జిల్లా జూనియర్ కళాశాల -19 స్కూల్ గేమ్స్ బాలికల క్రీడా జట్ల ఎంపికలను శనివారం ఎస్‌కెఎస్‌డి మహిళా(జూనియర్) కళాశాలలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు పట్టుదల, దృఢ నిశ్చయంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తిని పెంచాలన్నారు. వివిధ కళాశాల నుండి వచ్చిన విద్యార్థినులను చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు పరిచయం చేసుకున్నారు. జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలో వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో విభాగాల్లో జిల్లాకు చెందిన వివిధ కళాశాలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషనల్ జిల్లా సెక్రటరీ పి మాణిక్యం, కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ ఎం శ్రీనివాస్, ఎం రత్నకుమారి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ అండగా జగన్ : గ్రంధి

భీమవరం రూరల్:ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అండగా ఉన్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం నాగిడిపాలెం పంచాయతీ పరిధిలోని రెడ్డి చెరువులో ఎంఎల్ఎ ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి జల జీవన్ మిషన్ పథకంలో రూ.21 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. భీమవరం మండలానికి సంబంధించి రూ 11 కోట్ల నిధులను మంజూరు చేయగా, ఒక్క నాగిడి పాలెం గ్రామానికి రూ.97 లక్షలు తాగునీటి సమస్య పరిష్కారానికి ఖర్చు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జెడ్‌పిటిసి సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న ఆలయం కిటకిట

కాళ్ల:కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి ఆలయం కార్తీకమాసం సందర్భంగా శనివారం యాత్రికులతో కిటకటలాడింది. ద్వాదశి కావడంతో యాత్రికులు పెద్దఎత్తున స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు (డివి), ఆలయ ఇఒ చాగంటి సురేష్ నాయుడు, ధర్మకర్తలు, మాజీ ఎంఎల్ఎ శివరామరాజును సత్కరించారు. భీమవరం, ఉండి, ఆకివీడు, కాళ్ల కలిదిండి, వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



మాజీ ఎంఎల్ఎ శివరామరాజును సత్కరిస్తున్న ఛైర్మన్ కృష్ణంరాజు

అవినీతి రహిత సమాజం ఏర్పడాలి

ప్రజాశక్తి - నరసాపురం

అవినీతి రహిత భారత్‌ను సాధించడంలో పౌరులందరూ భాగస్వామ్యం కావాలని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి తెలిపారు. నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం దగ్గర అవినీతిపై అవగాహన ర్యాలీని పౌర గ్రంథాలయ శాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారుల ఉత్తర్వులు మేరకు గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కుమారి ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందిన దేశానికి అవినీతి రహిత భారతదేశంఅనే విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు లయన్స్ క్లబ్ కార్యనిర్వాహక వర్గం గ్రంథాలయ రీడర్స్, ఫోరం సభ్యులు, గ్రంథాలయ పాఠకులు, శాస్త్రవేత్త ఆర్‌వి సుబ్బారావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని దుంపగడప వివి.గిరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత సూచించారు. కళాశాల విద్యార్థులకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి 21 రోజులపాటు ప్రత్యేక ఇండక్షన్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు మరింత వేగవంతంగా శ్రద్ధతో అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆనంద్‌కుమార్, యు.శ్రీనివాసరావు, హెచ్ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ

ఉండి:ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ తెలిపారు. శనివారం ఉండి గోరింతోట, పడవలవానిపేట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం ఎక్కువగా ఉండడం వల్ల శిశువు ఎదుగుదల్లో లోపాలు అధికమవుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు.

డ్రెయినేజీలో తూడు తొలగింపు

మొగల్తూరు:మొగల్తూరు పంచాయతీ పరిధి కొత్త కాయలతిప్ప సమీపంలోని దర్భరేవు డ్రెయిన్లో గుర్రపుడెక్క, తూడు శనివారం తొలగించారు. కల్వర్టులో తూడు, చెత్త పేరుకుపోవడంతో పైపుల నుంచి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. స్పందించిన అధికారులు చెత్తను తొలగించారు.

ఆక్వారంగ అభివృద్ధిపై అవగాహన

నరసాపురం టౌన్:వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్ వద్ద జూలజీ, ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో 'ఆక్వా రంగంలో ప్రస్తుత పద్ధతులు - పోకడలు అంశంపై కె.ఫణీంద్రకుమార్ (విర్బాక్ ఆక్వా కంపెనీ) ప్రసంగించారు. ఈ సభకు కెఎస్ఎస్‌విఎన్.లక్ష్మీ (లెక్చరర్) సభికులను ఆహ్వానించగా పివైవి.సత్యనారాయణ (జువ్వాలజీ హెచ్‌ఒడి) ప్రారంభ ఉపన్యాసం చేశారు.ఈ సందర్భంగా హెచ్‌ఒడి మాట్లాడుతూ విద్యార్థులకు ఆక్వా రంగం అభివృద్ధి చెందాలంటే అవగాహన, మెలకువలు తెలుసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎపివి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీన్ జి.రామకృష్ణ, సిహెచ్.దుర్గాభవాని మాట్లాడారు.

రవిబాబు అరెస్టు అన్యాయం : ఎంఎల్ఎ

ఉండి:నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి బురిడీ రవిబాబును అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఇటీవల ఉఅర్తమూరు గ్రామానికి చెందిన యువకుడు జొన్నల వజ్రంపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు దాడి చేయగా అతను భీమవరంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే జొన్నల వజ్రం ఇచ్చిన ఫిర్యాదులో టిడిపి యువ నాయకుడు బురిడీ రవిబాబు పేరు లేదని, కానీ ఉండి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రథమ ముద్దాయిగా బురిడీ రవిబాబు పేరు ను పోలీసులు నమోదు చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. శుక్రవారం రాత్రి బురిడీ రవిబాబును భీమవరంలోని కోర్టు ఆవరణలో మంతెన రామరాజు కలసి పరామర్శించారు.